# భాగ్యవంతుల బాహ్యచిహ్నాలు

శ్రీమతి టి. వి. రత్నావళిగారు

"ప్రభూ! ప్రభూ!" అని పిలచి యెక్కడ కనబడనందున, సర్వసాధారణంగా మేడమీద వరండాలో ప్రభూ కూర్చోడం అలవాటు గాబట్టి గబగబా అక్కడికి వెళ్లాడు, ప్రసాదం, ఆఫీసునుండి రాగానేను. "ఏమిటి ప్రభూ! అస్తమానం ఆ వరండాలోనే కూర్చుంటున్నావు, ఆ యెదిరింటి వార్ని జూస్తూను. ఆఖరికి నీకు పిచ్చెత్తేటట్లుంది." అన్నాడు ప్రసాదరావు భార్యతో.

"నిజమేనండీ నాకు పిచ్చెత్తేటట్లే యున్నది. ఇప్పుడే కారు చప్పుడైతేను వాళ్లను చూద్దామని వచ్చాను అయినా చూడండీ, మీతో సమాన ఉద్యోగస్తుడేకదా! వాళ్లేలా గొప్పగా యుంటారోను. ఈ ఊరువచ్చి మూడు నెలలు కాలేదు కారు కొనేశాడు" అంటూ అతని మామూలు బట్టలు కట్టుకుందుకు యిచ్చి, ఆఫీసుడ్రెస్సు స్టాండుకి వేసింది.

"ఏమిటే, నీకు కారు కావాలా, ఉండు, ఇప్పుడే బజారుకు వెళ్లి, మంచి పట్టు కారు, పట్టు కొస్తాను. నువ్వు చెయ్యి కాల్చుకోకుండా వండడానికి" అన్నాడు వెటకారంగా.

"ఎందుకంత వెటకారం, చెయ్యి కాల్చుకుంటానని, పట్టుకారు కొంటా ననకపోతే మీ స్నేహితుడులాగే, ఒక వంట మనిషిని పెడతా ననగూడదు" అంటూ కాఫీ, టిఫెను తెచ్చి ముందర పెట్టి, వంటకు వెళ్ళింది. ఆ టిఫెను తినివేసి షికారు వెళ్లిపోయాడు ప్రసాదరావు.

ప్రసాదరావు యింటికి వచ్చేటప్పటికి రాత్రి 8 అయింది. "ఏమిటండీ ఆ కట్టుకున్న పంచ అలా పాడైంది" అంది ప్రభు.

"ఏమిలేదూ, నేను బయటకు వెళ్లగానే వర్షము వచ్చింది తెలుసా? బీచినుంచి నడచి వస్తూంటే, మన యెదురింటి భాగ్యదంపతులు, నా ప్రక్కనుండి కారులో వెళ్లిపోతూ, నా మీద ఆ దుమ్ము నీరంతా కొట్టేశారు. ఆ భాగ్యవంతుల బాహ్యచిహ్నాలివి." అన్నాడు నవ్వుతూను

"బాగుంది, బాహ్యచిహ్నాలేమిటి? ఎందుకంత వెటకారం. అసలు నిజంగా భాగ్యవంతులు కాకపోతే, అలా బంగళాలోనుండి, కారు కొనగలరా! ఏ సినిమా వచ్చినా, మొదటి వారమే ఫస్టు క్లాసుకు, వెడతారు. మనం అలాగ వెడుతున్నామా?" యని చిన్నబుచ్చుకుంది ప్రభు. "పిచ్చిదాన, అంత ఎత్తు ఎప్పుడు, ఎత్తకూడదు, మనిషి నిమిషంలో కూలిపోతాడు. నాతో సమాన ఉద్యోగస్తుడైనా వాడేమీ అంత భాగ్యవంతుడు కాదు. మా చెల్లి అత్తగారి ఊరే వారి దీని. భార్య భాగ్యవంతురాలై గుండవచ్చును." అన్నాడు భార్యకేసి చూస్తూను. "ఔను, పాపం అస్తమానం మా వాళ్లు పెట్టలేదనే కదూ, నన్ను దెప్పడం" అని ప్రభు అంటూండగా భోజనానికి, వెళ్లిపోయారు. ఎదురింటి రమణారావుది, అసలు కోనసీమ, గానీ. అతను చదువు రీత్యా ఎప్పుడూ, రాజమండ్రిలోనే, పెరిగేడు, వాళ్లు ఎక్కువ భాగ్యవంతులు కాకపోయినా, కూడు, గుడ్డల కెంతమాత్రం, లోటులేదుగానీ, అతనెప్పుడూ,

చాలాదర్జాగా నుండాలనే ప్రయత్నించేవాడు. ఉత్తడాబులరాయుడు. అతని, డాబులకు మోస పోయి భాగ్యవంతులతనికి, పిల్లనిచ్చేరు.

అతనికి అప్పుడే మద్రాసులో పని అయింది. క్రొత్తగా భార్య కాపురానికి రావడంగూడా, అప్పుడే కాబట్టి, అతను, చాలాదర్జాగానుండాలని, తన జీతం 100 రూపాయలైనా, చాలదర్జాగా ఖర్చు చేసేవాడు. గొప్ప యింటిబిడ్డ కాపురానికి వస్తుందని, ఉద్యోగం అనగానే, ఒక చిన్న బంగళా, అద్దెకు తీసుకున్నాడు. నిత్యం రెండుపూటలా వాడకుండా, పూలుకొనేవాడు. భార్యస్నేహితులకి, తన స్నేహితులకి, నిత్యం యింట్లో, టీ పార్టీలు జరుగుతూ యుండేవి.

సాయంత్రం 4 ఘంట లయేసరికి చేతిలో బేట్లు తీసుకొని, అయ్యగారూ, టెన్నిసుకోర్టుకు, అమ్మగారు లేడీసు క్లబ్బుకి. కొన్నాళ్లకు లేడీసు క్లబ్బులో ప్రభావతమ్మకు రమణారావు భార్య రవణాలకు స్నేహమైంది. గొప్ప వాళ్లతో స్నేహం చెయ్యాలని, ప్రభావతమ్మ, ఎటులనో భర్తను వప్పించి, క్లబ్బులో మెంబరుగా చేరింది. ఆమె సరదాతీరింది.

రవణాలు పల్లెటూరి పిల్లయైనా, చాలా టెంపర్ గా యుండేది. తను ఒక చిన్న పల్లెటూరి నుంచి, యేకంగా మెడ్రాసు రావడంతోటే, మరీ కళ్లు నెత్తికొచ్చేయి. తన స్నేహితులతోటి, భర్త స్నేహితులతోటి కలసి మెలసి సోషల్ గా యుండడమే మద్రాసు ఫేషన్ అనుకున్నది. అది సెంట్రలు స్టేషన్, మహిమలెండి. వారానికొక క్రొత్త నగ చేయించుకుంటూండేది, తన పెళ్లికి పెట్టిన కాసుల మాల మెడ్రాసు వచ్చాక ఆమెకు నాజూకుకాలేదు. అది చెరిపించి, నెక్ లెస్ చేయించుకుంది. వడ్డాణం చెరిపించి రవ్వల దుద్దులు చేయించుకుంది. వారానికొకరకం, ఫేషన్ చీరలు కొనేది. రవణారావుకి, బలేఛాన్సు దొరికింది. సగానికి సగం, రెండింటిలోను కమీషన్ కొట్టి నాటకం జరిపిస్తున్నాడు.

రవణారావు ఎంత డాబులరాయుడో, ప్రసాదరావు అంత నిరాడంబరజీవి. గొప్ప మేధావీను. రవణారావుతో సమాన ఉద్యోగస్తు డైనప్పటికిని, ఆ జీతంతోటే కాలక్షేపంచేసి, మిగల్చుకోవాలని తంటాలు పడేవాడు. తనకుగాని, భార్యకుగాని, అతిథి అభ్యాగతులకుగాని గౌరవ మర్యాదులలో లోటులేకుండా సంసారయాత్ర గడిపేవాడు.

ప్రభావతి, భర్తకు అనుగుణ్యముగా నడుస్తూన్న కాస్త ఆ భాగ్యవంతుల బాహ్య చిహ్నములు చూస్తే, అప్పు డప్పుడు కొంచెము మనస్సు చలిస్తూండేది. తమ రెండుకు అంత గొప్పగాను, దర్జాగాను యుండగూడదని.కాని ప్రసాదరావుకి తన భార్యకు వాళ్ల పిచ్చి ఎక్కడ అంటుకుంటుందో యని భయపడేవాడు. అప్పుడే క్లబ్బునుండి వచ్చింది ప్రభావతమ్మ. "ఏమిటే క్లబ్బు విశేషాలు" అన్నాడు ప్రసాదరావు భార్యతో.

"అస్తమానం మా ఆడవాళ్లను తిడుతూ యెందుకు మా క్లబ్బుమాట అడుగుతారు" అంది ప్రభావతమ్మ.

"అంటే, మీ ఆడవాళ్ల క్లబ్బులో చాలా చాలా వింతలు, విశేషాలు ఎక్కువగా యుంటాయిగనక."

"ఔను పాపం మామీదేమీధ్వజం. కానీ, ఈ వేళే రవణాలు, మంచి నెక్ లెస్ రవ్వల దుద్దులు కొనుక్కున్నది. చాలా బాగున్నాయి' అంది.

"అసలు బంగారమేనా? లేక రోల్డుగోల్డువా?"

"ఆ చాల్లెండి మీ మాటలు మీరూను, మీరు చేయించలేరుగాని, అందర్ని అలాగే అంటారు. మీ కెందుకంత మత్సరం. ఒకళ్లు చేయించుకొంటేను. అసలు నేను క్లబ్బుకి వెళ్లడమే మీ కిష్టములేదు. మిమ్మల్ని కొరక్కుని తిని ముఖ్య

ముగా ఇటువంటివన్ని చూద్దామనే ఈ క్లబ్బులో చేరేను." "అయితే నీకు నెక్లేస్ కావాలంటావా ?"

"మరే, రేపే చేయించేస్తా"రని అంది, ఉక్రోషంతో. "వెర్రిపిల్లా! చూడు స్త్రీలకు శీలమే గొప్ప భూషణం. అంతకంటే ఏంకావాలా ? సతికి పతే గొప్ప నగ. నీవు క్లబ్బుకు వెళ్లి తెలుసుకున్న దేమిటంటే, నగలు చేయించుకోవడం - అన్న మాట. అంతేనా ?"

"చాల్లెండి యింతేగా మీ మొగాళ్ల గొప్పతనం. మమ్మల్నిమించి ప్రపంచకమే లేదంటారు. దేవుడే లేడు. అంతా మేమే మంటారు. మీదంతా స్వార్థమేను."

"అయితే రవణారావు లాగున ఊరంతా అప్పులుచేసి నీకు నగలు చేయించమంటావా ?"

"నిజంగా అప్పులేచేస్తేనేం, చూడండి, మరో రకం కారు. ఈ నెలాఖరున కొన్నాడు మళ్లీను" అంది.

"వాడు అసలు కారు కొనాలేదు, యేమిలేదు. కారు కొంటానని ప్రతి కంపెనీ వాళ్లని అడుగుతే, ముందు ఒక నెల డ్రైవరుతో సహా, వాళ్లు కారు వాడుకోనేందుకు ఇస్తారు. అలాగే ప్రతి కంపెనీకి వెళ్లి, నెలకో కారు, తెస్తున్నాడు. అదీ వాడి మాయ. అద్దివాడు అద్ది అడుగుతే, ఇదుగో చెక్కు మారుస్తా నంటాడు. అంతా ఉత్తదే నిన్న కంపెనీ వాళ్లు, ఇంటివాళ్లు ఒకటే గోల." అంటూండగా తలుపు చప్పుడైంది. తలుపు తియ్యగానే, కార్లో నుంచి, ఆ భాగ్య దంపతులు అప్పుడే సినిమాకు వెడుతూ ఇక్కడ దిగారు. ప్రసాదరావుకి, ప్రభావతమ్మకు చాల ఆశ్చర్యమేసింది. దంపతులను ఆహ్వానించారుగాని, రవణాలు, గబగబా ప్రభువుని లోపలికి తీసుకొనివెళ్లి ఏమండీ ఒక్క 15 రూపాయలుంటే ఇస్తురు. ఇంటి నిండా చుట్టాలు వచ్చారు. రేపు ప్రొద్దుటేగాని, బ్యాంకు తెరవరు. తెరువగానే తెచ్చి ఇస్తాను" అని అడిగింది.

రవణాలు కారుతో, మనింటికి వచ్చిందే పది వేలు. ఇంక ఆమె సొమ్ము అడిగితే ఇంకేముంది, ఆమె భాగ్యమునకు మోహితయై వెంటనే 15 రూపాయలు ఇచ్చింది ప్రభు భర్త ప్రసాదరావు పళ్లుకొరకుతున్నాడుగాని, ప్రభావతమ్మ లక్ష్యపెట్టక రూపాయలిచ్చింది. అవి తీసుకొని, ఆ భాగ్య దంపతులు వెళ్లిపోయారు.

"అయిందా క్షౌరం! నెక్లెస్ చేయించుకుందని పొంగవుగదూ! అనుభవించు" కోపావేశంతో వెళ్లి పడుకున్నాడు ప్రసాదం. సొమ్ముపోయి దిమ్మ పట్టిందని, చేసినపనికి విచారిస్తు, వెళ్లి పడుకుంది ప్రభావతమ్మ.

తెల్లవారింది, ప్రసాదం కాఫీత్రాగి కూరలుతెచ్చి యింట్లో పడేసి పేపరు చదువుతూ, ఈజీ చైరులో కూర్చున్నాడు. వంటలో మునిగిపోయింది ప్రభావతి. వీధిలో ఏవో కేకలు వినిపించాయి. పేపరు పడేసి వరండాలోకి వచ్చాడు ప్రసాదరావు. ఇంకేముంది, భాగ్యవంతుల యెదురిల్లు తాళం, ఇల్లుగల మనిషివచ్చి ఆర్నెల్లబట్టి అద్ది ఇవ్వలేదని, లబో, లబో అని మొత్తుకుంటున్నాడు. ఇది విని వీధిలో అప్పుల వాళ్లందరువచ్చి పడ్డారు బట్టలషాపువాళ్ల 500, పాల వాళ్ల 100, అంతా అప్పులే. అంతా అప్పులే.

వంట అయిపోయింది, భర్త యింకా భోజనానికి రాలేదని పిలవడానికి వచ్చింది ప్రభావతి. "ఈ గోలంతా ఏమిటండీ! అయ్యో వాళ్లిల్లు తాళం వేశారే"మంది.

"అబ్బే యేమిలేదు. అదంతా భాగ్యవంతుల బాహ్య చిహ్నాలు" అన్నాడు ప్రసాదం.

"ఇప్పటికేనా నమ్ముతావా ? నీకు నెక్లెస్ చేయించనా ? కారు కావాలనా?" అని వేళంకోళం చేసేడు.

"ఆఁ ఆఁ" అంటూ తలవంచుకొని లోపలికి వెళ్లిపోయింది ప్రభావతి.